క్లుప్తంగా

యువకుడు అదృశ్యం



ఎర్రవల్లిచౌరస్తా: యువకుడు అదృశ్యమైన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. వనపర్తి జిల్లాలోని రేచింతలకు చెందిన ఆవుల గో పాల్ గత కొంత కాలంగా ఎర్రవల్లి మండల కేంద్రంలోని రత్న ఆగ్రో ఇండస్ట్రీకి చెందిన వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గతనెల 28న వెల్డింగ్ షాపు నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. దీనిని గమనించిన షాపు యజమాని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువకుడి తండ్రి ఆవుల శ్రీను ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజు గడువు పెంచాలి

గద్వాల అర్బన్: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు సమగ్ర సమాచారం ఇవ్వకుండా, ఫీజు చెల్లించడానికి తక్కువ సమయం ఇవ్వడంతో చాలా మంది ఫీజు కట్టలేకపోయారన్నారు. ఇప్పటికీ విద్యార్థులు కళాశాలల చుట్టూ తిరుగుతున్నారని, పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున ఫీజు గడువు పెంచి, ఎలాంటి జరిమానా లేకుండా కట్టించుకోవాలని కోరారు.

బాధితుడిని పరామర్శించిన మందకృష్ణ



శాంతినగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మంగళవారం పరామర్శించారు. భీమన్న మాదిగ ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మందకృష్ణ మాదిగ జూలెకల్ స్టేజీలోని ఆయన నివాసంలో కలుసుకుని ఆరోగ్య పరిస్థితులను వాకబుచేశారు. ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడారు. భీమన్నకు, ఆయన కుటుంబానికి అన్ని విధాలా సాకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఆలయంలో బాల సంరక్షణ శిబిరం



అయిజ: వేసవి సెలవుల సందర్భంగా పట్టణంలోని అంబ భవాని ఆలయంలో మంగళవారం హిందు ధర్మ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన శిబిరంలో మంగళవారం అయిజ విభాగం సభ్యులు విద్యార్థులకు మానవ విలువలు, సంస్కృతి గురించి తెలిపారు. యోగ, సూర్య నమస్కారాలు వీటిపై శిక్షణ ఇచ్చారు. జూన్ 18వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకు బాల సంస్కారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హిందు ధర్మ పరిరక్షణ సమితి అయిజ విభాగం సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో సోమవారం అర్ధరాత్రి సలీం ఇంట్లో విద్యుదాఘాతంతో పరికరాలు దగ్ధమయ్యాయి. వాటితోపాటు రూ.50 వేల నగదు, నిత్యవసర సరుకులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. అదేగ్రామంలో సలీం అత్తగారింట్లో పడుకున్న వారు మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇల్లు కాలిపోయి ఉంది. ఈ సంఘటనలో రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు.ఈ విషయమై తహసీల్దార్ సలీంవుద్దీన్‌ను వివరణ కోరగా కంచుపాడులో జరిగిన షార్ట్‌సర్క్యూట్ సంఘటన తన దృష్టికి వచ్చిందని, బాధితుడు ఫిర్యాదుచేస్తే ఉన్నతాధికారుల దృష్టికి వివరించి న్యాయం చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు.

నిత్యవసర సరుకుల అందజేత

మంటల్లో నిత్యవసర సరుకులు కాలిబూడిదైన విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు.

ఏఐఎఫ్‌బీ నుంచి రంజిత్‌కుమార్ బహిష్కరణ

గద్వాల అర్బన్: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి రంజిత్‌కుమార్‌ను బహిష్కరించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజిత్‌కుమార్ ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తు తరుపున గద్వాల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారని, అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల గద్వాలలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి తాను, తన అనుచరులు ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కండువాలు వేసుకోని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారని, ఇది పార్టీ వ్యతిరేక చర్య అని తెలిపారు. ఏఐఎఫ్‌బీ పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామ్యమని తెలిపారు. రంజిత్‌కుమార్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు ఆయనను పార్టీ నుంచి బహిష్కరించినట్లు పేర్కొన్నారు.

పశుగ్రాసానికి పాట్లు

- కరువైన సాంప్రదాయ పంటలు
- మేతకు ఉపయోగపడని పంటల సాగు
- ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు
- ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ. 18,000



ఎడ్లబండ్లలో వరిగడ్డిని తీసుకెళ్తున్న రైతులు

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో సాంప్రదాయ పంటల కంటే వాణిజ్య పంటలే ఎక్కువ సాగుచేస్తుండడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. సాగునీటి వనరులున్న ప్రదేశాల్లో వానాకాలంలో పండించిన వరిపంట ద్వారా లభించిన వరిగడ్డి మాత్రమే పశువుల మేతకు ఆధారమైంది. అది కూడా సరిపడినంతగా లేకపోవడంతో కృష్ణానది పరివాహక ప్రదేశాల్లో సాగుచేసిన వరి పశుగ్రాసంపై అలంపూర్ నియోజకర్గం రైతులు ఆధారపడాల్సి వస్తోంది. పశువులకు పశుగ్రాసం దొరకకపోవడంతో అన్నదాతలు అధిక డబ్బు వెచ్చించి కష్ణానది తీరప్రాంతాల్లో పండించిన వరిగడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

తగ్గిన ఆహారధాన్యాల సాగు..

ఆహార ధాన్యాల పంటలు ఏడాదికేడాదికి తగ్గిపోతున్నాయి. దీంతో మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో సజ్జలు, మొక్కజొన్న, కొర్ర, కంది పంటల సాగు ఘననీయంగా తగ్గింది. దానికి ప్రత్యామ్నాయంగా మిరుప, ఉల్లి, పత్తి పంటలు ఎక్కువగా సాగుచేస్తారు. దాని వల్ల పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంటోంది.

పెరిగిన వరిగడ్డి ధర..

ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు, నది పరివాహక ప్రాంతాల్లో, బోరుబావులున్న ప్రదేశాల్లో ఆహార ధాన్యాల పంటలు ఎక్కువగా సాగు చేయకపోవడంతో ఒక ఎకరంలో పండిన వరిగడ్డి ధర రూ. 4వేలకు చేరింది. ఒక ట్రాక్టర్ వరిగడ్డి కావాలంటే మూడు ఎకరాల్లో సాగుచేసిన వరిగడ్డి సేకరించాలి. దానికోసం రూ. 12వేలు ఖర్చు పెట్టాలి. దాన్ని ఇతర గ్రామాలకు తరలించాలంటే ట్రాక్టర్ కిరాయి, రూ.3వేలు, కూలీల ఖర్చు రూ.3వేలు అవుతుంది. దీంతో మొత్తం ట్రాక్టర్ వరిగడ్డి ఖర్చు రూ.18వేలు అవుతోంది.

మండలం	గొర్రెలు	గేదెలు	ఆవులు
అయిజ	5342	9921	7421
ఇటిక్యాల	62130	5462	4628
మానవపాడు	25000	3500	3700
అలంపూర్	32425	3250	1980
ఉండవెల్లి	33325	2287	1731
వడ్డేపలి	31489	3986	2888
రాజోళి	32071	3986	2888



ట్రాక్టర్‌తో వరిగడ్డిని తరలిస్తున్న రైతులు

పశువుల మేత కరువైంది..



వాణిజ్య పంటలు సాగుచేయడంతో పశువులకు మేత కరువైంది. వేరుశనగ, కంది, జొన్న పంటలు పండితేనే మేతకు ఇబ్బంది ఉండదు. అవన్నీ తగ్గిపోవడంతో పశువులకు మేతలేకుండా పోయింది. పశుగ్రాసం కొరత వల్ల అధిక ధరలకు వరిగడ్డిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– యాకోబు, ఉప్పల క్యాంప్

వరిగడ్డి ఒక్కటే దొరుకుతుంది



డబ్బు పెట్టి కొనుగోలు చేయాలన్నా వరి తప్ప ఇతర ఆహార ధాన్యాల పశుగ్రాసం దొరకదు. నదీతీర ప్రాంతాల్లో పండించిన వరిగడ్డి మాత్రమే పశువులకు మేతగా దొరుకుతుంది. ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు నది పక్కల వరి సాగు చేస్తారు. దాన్ని కొనేందుకు అందరు రైతులు ఎగబడడంతో వరిగడ్డి ధర పెరిగిపోయింది. మేత కొనలేక రైతులు పశువులను అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

– తిమ్మప్ప, కిష్టాపురం

పచ్చిగడ్డిని సాగుచేయాలి



పశుగ్రాసానికి సంబంధించిన పంటలు ఎక్కువ సాగుచేయకపోవడంతో మండలంలో పశుగ్రాసం కొరత ఎక్కువైంది. దాని వల్ల రైతులు పొరుగు మండలాల్లో అధిక ధరలకు వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పశుగ్రాసం కొరత తీరాలంటే బోరుబావులున్న ప్రదేశాల్లో రైతులు పచ్చిగడ్డికి సంబంధించిన విత్తనాలు చల్లి పశుగ్రాసాన్ని పెంచాలి. సరైన హైబ్రీడ్ వంగడాలు సాగుచేస్తే గడ్డిని కోసేకొద్ది మళ్లీ పెరుగుతుంది. దాని వల్ల కొంతమేర పశుగ్రాసం కొరతను తగ్గించుకోవచ్చు.

– స్వరూపారాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

ఆరోగ్యకేంద్రంలో సాధారణ కాన్పులు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు జరగాలని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. మంగళవారం ఏఎన్ఎంలు, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు సాధారణ కాన్పులు జరగడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం గురించి తీసుకోవాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురైనా వారికి ఓఆర్ఎస్ అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎర్లీ రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యాకుబ్‌బాషా, చంద్రన్న, సంధ్యారాణి, అనూష, సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్వీర్

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్

ధరూరు: నాణ్యతకు మారు పేరు భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ సునీల్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని లక్కీ ట్రేడర్స్ షాప్ వద్ద మేస్త్రీలతో సమావేశమై 60 మంది మేస్త్రీకు ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. కాంక్రీటు సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారన్నారు. యాదాద్రి, వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణాలకు భారతి సిమెంటునే ఉపయోగించారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ విజయబాబు, టెక్నికల్ ఆఫీసర్ నితిన్, సబ్ డీలర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

పట్టణంలో స్పెషల్ డ్రైవ్

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని 5, 6 వార్డుల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా వార్డుల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను జేసీబీ తొలగించడం, ప్రధాన కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించే పనులు నిర్వహించారు. కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్న ఆయా వార్డుల ప్రజలకు ముళ్ల పొదలు, డ్రైయినేజీ కాల్వల్లో మురుగు తొలగించడంతో సమస్య పరిష్కారమైనందున ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



డ్రైయినేజీలో మురుగును తొలగిస్తున్న జేసీబీ

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండల కేంద్రంతో పాటు కొండాపురం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, మిల్లు వీరన్న, మహేష్, తదితరులు ఉన్నారు.

గట్టు: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా గ్రామాల్లో పని చేస్తూ, ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించుకుందామని కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య కోరారు. మంగళవారం గట్టులోని భవాని కమ్యూనిటీ హాల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో గట్టు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, వెంకటస్వామిగౌడు, గౌస్, మహబూబ్‌పాష, తుమ్మలపల్లి రవి, బల్గెర బజారి, కమ్మరి రాము, నర్సింహులు, ప్రభు, గోపాల్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేసిన బీజేపీని ఓడిద్దాం



ధరూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ధరూరు: తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీని ఓడించి ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలిపించుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో హమాలీ, సీపీఎం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రాజెక్టు మంజూరుతో సహా అన్ని విషయాల్లోనూ బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఐటీఆర్ బయ్యారం వంటి ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఎన్ని పోరాటాలు చేసినా పట్టించుకోలేదన్నారు. అంతకు ముందు ఎన్నికల బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహులు, గోసి గోవిందు, దేవదాసు, క్రిష్ణ, ఆంజనేయులు, తిమ్మప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు కూలిరేటు పెంచుతాం



అమరవాయిలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు



ఎర్రవల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మానవపాడు: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీ రూ. 400 పెంచుతామని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధికూలీలతో మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చు అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మండలకేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ పహిల్వాన్, మాజీ రైతు సంఘం నాయకుడు ఖలీమ్‌తో పాటు 50మంది మైనార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మానవపాడు, అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, చెన్నిపాడు గ్రామాలలో ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు, మండల కోఆప్షన్ నెంబర్ మహ్మద్ సిరాజ్, నారాయణపురం సతీష్‌రెడ్డి, మాలిక్‌బాషా, పరమేష్ నాయుడు, ప్రభాకర్, మైనార్టీలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీల పేరుతో ప్రజలను నట్టేట ముంచిందని అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులకే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరా రు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, అంజి, రవి, బీచుపల్లి, శివ, రాము, తదితరులు ఉన్నారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



మల్దకల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మల్దకల్: కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని విఠలాపురం, మల్దకల్, నాగర్‌దొడ్డి, మద్దెలబండ గ్రామాలలో ఇంటింటి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, రాములు, దామ నాగరాజు, తిరుపతిరెడ్డి, దర్శెల్లి, రవి, వీరన్నగౌడు పాల్గొన్నారు.

గట్టు: నాగర్‌కర్నూలు బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుల సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మండల అధ్యక్షుడు బలరాం తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బలరాం మాట్లాడారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు దయాకర్, నరేష్, అమరేష్, నర్సింహులు, వీరేష్, వాసు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, బోరవెల్లి తదితర గ్రామాల్లో ముఖ్య నాయకులను కలిసి ఓటుహక్కును వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే రావుల రవీందర్‌నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యనాయకులను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాల, నక్కలపల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు అబ్దుల్లా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్, మహేందర్, పీఆర్పీ, గోవిందు, నరేంద్ర, రాకేష్, రాజేష్, అంజి, రాముడు, కృష్ణ ఉన్నారు.

ధరూరు: పార్లమెంటు ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. మార్లబీడు, ధరూరు, ద్యాగదొడ్డి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుర్వ కిష్టన్న ఉపాధి కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నెట్టెంపాడులో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింట ప్రచారం చేపట్టారు. 9 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండల పరిధిలోని వెంకట్రామనగర్‌లో మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహులు, రంగస్వామి, పట్టణ అధ్యక్షుడు శేఖరాచారి, ఉపాధ్యక్షుడు మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూపురేఖలు మారుద్దాం

శాంతినగర్: స్వతంత్ర అభ్యర్థి అయిన తనకు ఓటేసి గెలిపిస్తే నాగర్‌కర్నూల్ రూపురేఖలు మార్చేందుకు తనవంతు కృషిచేస్తానని శిరీష (బర్రెలక్క) వడ్డేపల్లి ప్రజలకు తెలిపారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ సెంటర్‌లో మంగళవారం శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సమయంలో ప్రజలు ఆదరించారని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ప్రజలను కోరారు. అయిజ మున్సిపాలిటీ, మండలంలోని వెంకటాపురం స్టేజీల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు.

ధరూరులో బర్రెలక్క ప్రచారం

ధరూరు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క అలియాస్ శిరీష మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మన్నాపురం గార్లపాడు, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. దుకాణ సముదాయాల వద్ద, హోటల వద్ద యువకులను కలిసి విజిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించింది.



ధరూరులో ప్రచారం నిర్వహిస్తున్న బర్రెలక్క